# 38. దండుగ పండుగలు

హైదరాబాదు రైల్వే స్టేషన్ (నాంపల్లి)లో గోదావరి ఎక్స్‌ప్రెస్; నా కంపార్ట్‌మెంట్ పక్కనున్న ఫస్ట్‌క్లాస్ బోగీలోంచి దిగుతున్న అనంతరావు గార్ని గుర్తుపట్టాను. ముప్ఫయ్యేళ్ల కిందట నేను గుంటూరులో రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసినపుడు ఆయన మా కలెక్టరుగారు. పదేళ్ల కిందట రిటైరయ్యారు గాని, ఆయన మేధావి తనాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆయన్ని మరో మూడేళ్లపాటు (అధికారంలేని) పదవుల్లో నియమించి సలహాలు తీసుకుంది. ఆ తరువాత కూడా అలా ఉండవలసిన వారే; కాని అప్పటి ప్రభుత్వం వారు "వద్దులే" అన్నారు.

నన్ను ఆయన గుర్తుపడతారు అని కాదు గాని; దేవాలయం పక్కనుంచి కారులో వెళిపోతున్న పెద్దమనిషి గుడి దగ్గిరకి కారు రాగానే చెంప లేసుకుని నమస్కారం పెట్టినట్టు; ఆయనా, భార్యా దిగేవరకూ అక్కడ నుంచుని, ఆయన ఇటు చూడగానే-

"నమస్కారం సార్, నేను కె.వి. నారాయణమూర్తిని. తమరు గుంటూరు కలెక్టరుగా ఉన్నప్పుడు-" అన్నాను.

ఆయన నా వాక్యం పూర్తవకుండా భార్యవైపు తిరిగి; "మేం కలిసి పనిచేశాం" అన్నారు. నాతో- "ముప్ఫయ్యేళ్లు దాటినా ఇంకా నిన్న మొన్నలా ఉంది". అని షేక్హాండిచ్చారు.

అప్పటికీ ఇప్పటికీ మారని ఆ వినయం నన్ను ఒకానొక పారవశ్యంలో పడేసింది. "ఇతను నాకింద పనిచేసేడు" అనలేదు. "మేం కలిసి పనిచేసేం" అన్నారు.

"ఏమిటీ, ఇలా వొచ్చారు?" అని అడిగారు.

"ఇవాళ ఇక్కడ ఒక సభలో నాకొక చిన్న సత్కారం ఉందిసార్" అన్నాను. "గవర్నమెంట్ ఉద్యోగిగా కాదు; రచయితగా" అన్నాను గర్వంగా.

అనంతరావు గారు అర నిమిషం పాటు ఆలోచించి "ఔనౌను. ప్రోగ్రాంలో మీపేరు చూసేను. ఓకే; ఆ సభకి నేనూ వస్తున్నాను" అన్నారు.

అప్పటికి గాని నాకు గుర్తు రాలేదు; ఆ సభలో ఆయనకి కూడా సత్కారం ఉందని.

★★★

సభా కార్యక్రమం రెండు గంటలకి పైగా సాగింది. ఎనిమిది మంది రాజకీయ నాయకులు మాట్లాడారు. వందల సంఖ్యలో పూలదండలు పడ్డాయి. ఫ్లాష్ కెమెరాలూ వీడియో కెమెరాలూ నిర్విరామంగా పనిచేసేయి. డజన్ల సంఖ్యలో మెమెంటోలు పంచిపెట్టారు. నేనూ ఒకటి అందుకున్నాను.

"ఈ ప్రభుత్వానికి ఎంతో ఆప్తులు, ఈ రాష్ట్ర ప్రజల శ్రేయోభిలాషులు అయినా సరే, గత ప్రభుత్వం యొక్క ఒకే ఒక్క కలం పోటుతో మరుగున వుండిపోయిన మేధావి శ్రీ అనంతరావుగారు తమ సందేశం వినిపిస్తారు" అని ఎనౌన్స్ చేసేరు; సభా నిర్వాహకులు.

అనంతరావు గారు వేదిక ఎక్కి "నా సందేశం అంత రుచికరంగా ఉండదేమో అని భయపడుతున్నాను" అన్నారు మైకులో.

ముఖ్య అతిథి కుర్చీలోంచి లేచి నుంచుని తన కెదురుగా ఉన్న ప్రత్యేక మైకులో "మేధావి వర్గం వారు ఇచ్చే సందేశాలు ఒక్కొక్కప్పుడు రుచికరంగా ఉండకపోవడం కూడా సహజమే. అయినా అనంతరావు గార్ని మాట్లాడవలసిందిగా కోరుతున్నాను." అన్నారు.

అనంతరావు గారు ముఖ్య అతిథికీ, సభాధ్యక్షునికీ, సభకీ నమస్కారాలు చెప్పి ఇలా అన్నారు.

"నిజానికి నేను ఇవాళ ఈ సభకి రావలసింది కాదు. మా అమ్మాయీ, అల్లుడు అమెరికాలో ఉంటున్నారు. వాళ్లు ఒక నెల పాటు ఉండడానికి గాను మా వియ్యాల వారి వూరికి, అంటే విశాఖపట్నానికి; పది రోజుల కిందట వచ్చారు. ఈ నెల రోజులూ మా అమ్మాయితో, అల్లుడితో, మనవళ్లతో గడుపుదామని నేనూ, మా శ్రీమతీ విశాఖపట్నం వెళ్లేం. ఈ సభలో నాకు సత్కారం ఉందని, వీలు చూసుకుని హాజరు కమ్మని, ప్రభుత్వం వారు నాకు విశాఖపట్నం కలెక్టరు గారి ద్వారా ఆహ్వానం పంపేరు. అయితే, రాక రాక వచ్చిన మా అమ్మాయే ఎక్కువ ఆకర్షణగా తోచి నేనీ సభకి రాలేనని మనవి చేసేను. కాని, నిన్న మధ్యాహ్నం ఒంటి గంటకి నాకు ఇక్కణ్ణించి ఒక ఫోన్‌కాల్ వచ్చింది. అది మా గురువుగారైన జగన్నాథం గారి అబ్బాయి నుంచి. "నాన్న గారు పోయారు. ఆఖరి నిమిషంలో మీ గురించి భోగట్టా చేసేరు. రేపు ఉదయం దాకా అంత్యక్రియలు చెయ్యడం లేదు. కనుక తెలియజేయడమైంది"- అన్నారు. నేను వస్తున్నాననీ, చివరి చూపు కోసం వారి భౌతిక కాయాన్ని ఉంచమనీ చెప్పి నిన్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి బయలుదేరి వచ్చాను. ఈ ఉదయం రైలు దిగుతూనే అక్కడికి వెళ్లి, ఈశ్వర సాయుజ్యం పొందిన మా గురువుగారి అంతిమ దర్శనం చేసేను. ఎలాగా ఇక్కడికి వచ్చాను కదా అని ఈ సభకి కూడా వచ్చేను.

"నేను 1942లో సరాసరి నియామకం మీద ఈ ప్రభుత్వంలో ఉద్యోగానికి చేరాను. అప్పుడు నన్ను శిక్షణ కోసం జగన్నాథం గారి దగ్గర వేశారు. ఆయన ఆ రోజుల్లో కాకినాడ డిప్యూటీ కలెక్టరు. 1890 లో పుట్టారు. 1907లో రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో రికార్డు గుమస్తాకి అసిస్టెంట్‌గా చేరారు. కష్టపడి పనిచేసి, నిజాయితీగా ప్రవర్తించి, 1935కి డిప్యూటీ కలెక్టర్ అయ్యారు. అప్పటి బ్రిటీష్ అధికారులకి ఆయన నిజాయితీ మీదా సామర్థ్యం మీద ఎంత గురి ఉన్నా ఆయన్ని కలెక్టరుగా ప్రమోట్ చెయ్యలేకపోయారు. నేను ఆయన దగ్గిర 18 నెలలు ట్రెయినింగ్ అయి, మరో పదినెలలు ఒక తాలూకాకి తాసిల్దార్ చేసి 1945లో ఆయన రిటైరైనప్పుడు ఆయన దగ్గిర డిప్యూటీ కలెక్టర్‌గా ఛార్జి తీసుకున్నాను...

"జగన్నాథం గారు 38 ఏళ్లు సర్వీస్ చేసేరు. అందులో వింత ఏమీ లేదు. 1945లో రిటైరైన జగన్నాథం గారు - నిన్నటి వరకు సజీవులై ఉన్నందున - 45 ఏళ్లు పెన్షన్ తీసుకున్నారు. అదీ వింత...

"అదొక్కటే వింత కాదు. 1950 లో ఆయనకి అరవై ఏళ్లు నిండాయి. ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు; పదహారు మంది మనవళ్లూ, మనవరాళ్లూ; అప్పటికి ఆయనకి. వారి ఇల్లాలు, కొడుకు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు షష్టిపూర్తి ఉత్సవం చేస్తాం అని ఎంతో ఉత్సాహపడితే ఆయన ఒప్పుకోలేదు. నూరేళ్లు బ్రతకమని సృష్టికర్త ఆదేశం అయివుండగా అరవై ఏళ్లు అవగానే అదో పెద్ద సంఘటన లాగా ఉత్సవం ఎందుకు; అంతగా మీరందరూ నాతో కలిసి ఫొటో దిగాలనుకుంటే పెద్ద మనవడికి ఉపనయనం చెయ్యండి - అన్నారాయన.

"కాలం బాగా మారిపోయింది...

ఇవాళ నేను జగన్నాథం గారి భౌతిక కాయం మీద నాలుగు పువ్వులూ రెండు కన్నీటి బిందువులూ రాల్చి మా ఎపార్ట్‌మెంటుకి రాగానే "మా పక్క ఫ్లాట్‌లో వాళ్లు భోజనానికి పిలిచారు. వాళ్ల అబ్బాయికి పెళ్లయి ఒక ఏడాది అయిందట. సరే అలాగే అని స్నానాలూ అవీ చేసుకుని కూర్చునే సరికి విశ్వనాథరావు గారని, మా ఎదురింట్లో ఉండే సినిమా ప్రొడ్యూసర్ వచ్చి ఒక ఆహ్వానం ఇచ్చేరు. రేపు సాయంకాలం వారి సరికొత్త చిత్రం 50వ రోజు పండగ కనకా, టీ పార్టీకి రమ్మని. ఈ సభలో ఒక రచయిత ఉన్నాడు. అతను ఏదో పత్రికకి ఫీచర్ రాస్తున్నాడుట. ఆ ఫీచరులో పాతిక వ్యాసాలు వచ్చేయని రేపు పదిహేనో తారీఖున విజయవాడలో పెట్టే సభకు రమ్మంటున్నాడు...

"ఇప్పుడీ సభ ఎందుకు పెట్టేరో మీకు తెలుసు. చట్టబద్ధమైన ఎన్నికల ద్వారా ఈ ప్రభుత్వం ఏర్పడి ఇవాళకి ఒక ఏడాది అయిందని పెట్టేరు. ఈ ఏడాది పాలనలో గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలన్నిటినీ ఒకటొకటిగా ఎలా రద్దు చేశారో అదంతా చెప్పుకుని ఆత్మస్తుతీ, పరనిందా చేసుకున్నారు. అలా చెయ్యడమే రైటనీ, ఇదే నిజమైన ప్రభుత్వం అనీ పత్రికల్లో వ్యాసాలు రాసిన భట్రాజులకి ఈ సభలో సత్కారాలు చేసేరు...

"నూరేళ్లు బతకవలసిన మనిషి అరవై ఏళ్ల పండగ చేసుకుంటే అంత బాధపడక్కర్లేదేమో.

"అలాగే 25 వారాలు ఆడుతుందని నిర్మించిన సినిమా 50 రోజులు ఆడేసరికి పొంగిపోడం కూడా సహజమేనేమో . కాని జీవితాంతం కలిసి బ్రతుకుతాం అని ప్రమాణాలు చేసుకుని సంసారం చేసే భార్యాభర్తలు ఒక సంవత్సరం గడిచేసరికి పండగ చేసుకోవడం దేనికో నాకు అర్థం కాలేదు. అంటే వచ్చే ఏడాదిలోగా విడిపోతారని భయమా? అలాగే ఐదేళ్లు అధికారంలో ఉండి ప్రజారంజకంగా పాలన సాగిస్తాం అని తలపోసిన ప్రభుత్వం ఒక ఏడాదికే పండగ ఎందుకు చేసుకోవాలి? ఇదంతా చూస్తూ ఉంటే ఢిల్లీ ప్రభుత్వం కూడా ఏ 25 రోజుల పండగో చేసేసుకుంటుందనీ, అందుకోసం ప్రజా ధనాన్ని వెచ్చించగలరనీ భయంగా వుంది నాకు. అవన్నీ ఆపేసి ఈ ఉత్సాహం పరిపాలనా దక్షతగా మార్చుకుని మంచి ప్రభుత్వం అనిపించు కోగలిగితే ప్రజలే మిమ్మల్ని మళ్లీ ఎన్నుకుని మీకు పండగ చేస్తారు కదా!...

"అందుకని; పండగల దండుగలు ఆపి; పనులు చెయ్యడం మంచిదనే, నేనిచ్చే సందేశం".

★